క్లుప్తంగా

నేడు 'స్పందన'

ఎ.కొండూరు: స్థానిక కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారన్నారు. ప్రజా సమస్యలపై అర్జీలు పెట్టుకుంటే వాటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు.

గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొనే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని కోరారు.

ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు చర్యలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో ఇంటింటి కుళాయి ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దృఢ సంకల్పం సాకారమయ్యే దిశగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు చర్యలు చేపట్టారు. మార్చి 14వ తేదీ నాటికి డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) సిద్ధం చేసేందుకు టెండర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఇంటింటి కుళాయి పథకానికి రూ.57.93 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఎలివేషన్ స్టోరేజ్ రిజర్వాయర్, అంతర్గత పైప్‌లైన్ పనులు చేపట్టనున్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుశీలరావు కోరారు. ఆదివారం పూర్వవిద్యార్థుల సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో పాటు ఆధునిక కోర్సుల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదించామని, యూజీసీ నిధులతో భవనాల నిర్మాణం జరిపామన్నారు. నాక్ గుర్తింపు రెన్యువల్‌కు అవసరమైన ఏర్పాట్లు చేశామని, పూర్వ విద్యార్థుల సహకారంతో కళాశాలను అభివృద్ధి చేస్తామని ప్రిన్సిపాల్ వివరించారు. పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు కంచర్ల ముత్యప్రసాద్, గజ్జల సీతారామారావు, ఉయ్యూరు అనసూయ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

రాజవరం(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను-2 సచివాలయం పరిధిలోని రాజవరంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 8 గంటలకు నిర్వహించే ఈకార్యక్రమంలో తిరువూరు శాసన సభ్యులు కే రక్షణనిధి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. కాగా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పార్టీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరావు కోరారు.

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ గ్రామ సచివాలయం పరిధిలోని సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు రెడ్డిగూడెం మండల జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయభాస్కరరెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పాల్గొంటారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ముసునూరు: మండలంలోని యల్లాపురం గ్రామంలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.రాణి ఆదివారం విలేకరులకు చెప్పారు. సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు. కార్యక్రమానికి అధికారులు, సకాలంలో హాజరుకావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వర గానామృతం

గంపలగూడెం: గంపలగూడెం సీతారామచంద్ర స్వామి ఆలయంలో వేంకటేశ్వర గానామృతం కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు చారుగుండ్ల నాగేశ్వరరావు, వరలక్ష్మి, వెంకట రామారావు, సుజాత దంపతులచే నిర్వహించిన కార్యక్రమంలో చీరాలకు చెందిన ఓం బ్రహ్మశ్రీ సద్గురు శివ కేశవ జగన్నాథ భక్త బృందం గానామృతాన్ని వీనులవిందుగా, చూడముచ్చటగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శ్రీనివాస, పద్మావతీదేవి కల్యాణాన్ని కనులవిందుగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా ఎదుర్కోలు ఉత్సవం, కన్యాదానం కార్యక్రమాలు అట్టహాసంగా చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి: వట్టిగుడిపాడులో పేకాట శిబిరంపై ఆదివారం దాడి చేశామని ఎస్‌ఐ ఎస్.చంటిబాబు తెలిపారు. ఈ దాడిలో ఆరుగురు జూదరులను అరెస్టు చేసి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

స్వగృహ కల సాకారం

- జగనన్న కాలనీలు కళకళ
- ముమ్మరంగా గృహ నిర్మాణాలు
- నూజివీడు పట్టణం, రూరల్ పరిధిలో 1,399 గృహాల నిర్మాణం పూర్తి


నిర్మాణం పూర్తయిన గృహం


నూజివీడు మండలం తుక్కులూరులోని జగనన్న కాలనీలో నిర్మించిన గృహాలు

నూజివీడు: నూజివీడు పట్టణం, మండలంలో పేదల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో పక్కా గృహాల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. పట్టణంలోని 13 లేఅవుట్లలో, మండలంలోని 39 లేఅవుట్లలో కలిపి 5,007 గృహాలను, సొంత స్థలాలు ఉన్న వారికి 2,244 గృహాలను మంజూరయ్యాయి. దీంతో సొంతిల్లు నిర్మించుకోవాలనే పేద కుటుంబాల కల కార్యరూపం దాలుస్తోంది.

పేదల కళ్లలో వెలుగులు..

కనీవినీ ఎరుగని రీతిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' సాకారం అవుతుండటంతో పేదల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయి. దరఖాస్తు చేసుకున్న అతి తక్కువ రోజుల్లోనే ఇళ్ల స్థలాలను అందజేయడమే కాకుండా ఇళ్లను మంజూరు చేసింది. దీంతో పేదలు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తాము కొంత మొత్తం కలుపుకొని గృహాలను నిర్మించుకుంటున్నారు. గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లుల సొమ్మును ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలోనే జమ చేస్తోంది.

తక్కువ ధరకే సిమెంట్, స్టీల్..

జగనన్న లేఅవుట్లలో గృహాలు నిర్మించుకుంటున్నలబ్ధిదారులకు ప్రభుత్వం ఒక్కో ఇంటికి 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తోంది. ఐఎస్‌ఐ మార్కు ఉన్న నాణ్యమైన సిమెంట్, స్టీల్, ఇతర వస్తువులను మార్కెట్ ధరల కంటే తక్కువకే అందిస్తోంది. లబ్ధిదారులకు సమస్యలు ఎదురైతే వలంటీర్ వద్ద ఉన్న యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. స్థోమత లేని వారికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లు లబ్ధిదారులకు పావలా వడ్డీకే ప్రభుత్వంరుణాలు అందిస్తోంది. పట్టణం,మండలంలో 7,251 గృహాలు మంజూరు నూజివీడు పట్టణంలో లేఅవుట్లు, సొంతస్థలాల్లో కలిపి 3,484 గృహాలు మంజూరు కాగా, వీటిలో ఇప్పటివరకు 73 గృహాలు మాత్రమే ఇంకా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన గృహాల నిర్మాణం ప్రారంభమై పలు దశల్లో ఉన్నాయి. 397 గృహాల నిర్మాణం పూర్తయ్యాయి. నూజివీడు మండలంలో 3,767 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 1,002 గృహాలు నిర్మాణం పూర్తయ్యాయి. మిగిలిన గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. లే అవుట్లలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించారు.

మండలంలో గృహాల వివరాలు

ప్రాంతం	మంజూరైన గృహాలు	ప్రారంభించనవి	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్న గృహాలు
నూజివీడు మండలం	3,767	231	1,002	2,534
నూజివీడు పట్టణం	3,484	73	397	3,014
మొత్తం	7,251	304	1,399	5,548

మిగలిన గృహాలు త్వరగా నిర్మించాలి..

మిగిలిన లబ్ధిదారులు పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలి. ప్రభుత్వం ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షలు ఇవ్వడంతో పాటు డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణాలను అందిస్తోంది. గృహాలను నిర్మించడానికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారు. వారికి ఇస్తే మరింత వేగవంతమవుతాయి.

–వెంకటేశ్వరరావు,
ఏఈ, హౌసింగ్, నూజివీడు

ఇంటికొచ్చి పింఛన్ ఇవ్వడం సంతోషం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే రక్షణనిధితో లబ్ధిదారులు


మిర్చి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

పుట్రేల (విస్సన్నపేట): ప్రతి నెలా ఒకటో తేదీనే మా ఇంటివద్దనే వలంటీర్లు పింఛన్లు అందించడం ఆనందంగా ఉందని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి ఎదుట పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాకే ఇది సాధ్యం అవుతుందన్నారు. మండలంలోని పుట్రేల సచివాలయం-2లో ఆదివారం నిర్వహించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలోఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీల కతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. 470 కుటుంబాలను ఎమ్మెల్యే సందర్శించారు. సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఇళ్లు మంజూరు చేయాలని స్థానికులు కోరగా ఫేజ్-2లో ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సచివాలయం-2 పరిధిలో 1,141 మంది లబ్ధిదారులకు రూ.12,9, 62,162 వివిధ సంక్షేమ పథకాల రూపంలో అందించామని ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. పుట్రేల పంచాయతీ పరిధిలో రెండు సచివాలయాల పరిధిలో రూ.28 కోట్ల మేరకు సంక్షేమ పథకాల కింద అందజేశామని, వివిధ అభివృద్ధి కార్యక్రమాల కింద మరో రూ.2 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఒక్క పుట్రేల పంచాయతీకే సుమారు రూ.30 కోట్లతో సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు అమలు చేశామని ఎమ్మెల్యే వివరించారు. కల్లాల్లో మిరప పంట ఆరబోసుకున్న మిర్చి రైతులతో ఎమ్మెల్యే మాట్లాడారు. పంట దిగుబడి, గిట్టుబాటు ధరలు గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ కారుమంచి స్వాతి, సొసైటీ అధ్యక్షుడు బి.సూర్యనారాయణ రెడ్డి, కెడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, ఎంపీటీసీ సభ్యులు ఎస్ అంజిరెడ్డి, జి.నాగేశ్వరరావు, చాట్ల మణి, సచివాలయ గహసారథుల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, ఎంపీడీఓ ఎస్ వెంకట రమణ, కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, చలువాది మల్లిఖార్జునరావు

మైలవరం: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ జాగ్రతలు తీసుకోవాలని ప్రవాసాంధ్రులు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కోరారు. మైలవరం చలువాది మల్లిఖార్జునరావు (సీఎంఆర్) కన్వెన్షన్ హాల్లో మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఆహారపు అలవాట్లు మార్చుకుని, నియమ నిబంధనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రెండు, మూడు నెలలకు ఒక సారైనా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం వలన ముందస్తుగా రోగాన్ని గుర్తించి తగిన వైద్యం చేయించుకోవాలని సూచించారు. ప్రముఖ వ్యాపారవేత్త, విద్యావేత్త చలువాది మల్లిఖార్జునరావు మాట్లాడుతూ మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను, మాతృభూమిని మర్చిపోకుండా ఎక్కడ ఉన్నప్పటికి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషకరమన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు వివిధ జబ్బులతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సావనీర్ విడుదల చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, గ్రామ ప్రముఖులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరాలయ వార్షికోత్సవం

తిరువూరు: స్థానిక కుమ్మరబజారులోని శ్రీవిఘ్నేశ్వరాలయ 44వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. గణపతికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు, అభిషేకాలలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. తిరువూరు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు ప్రారంభం

తిరువూరు: స్థానిక శ్రీరాజ్యలక్ష్మీ సమేత రంగనాయకస్వామి దేవస్థాన పునర్నిర్మాణం సందర్భంగా విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. యాగశాలలో వేద పండితులు అంకురార్పణ, విశేషపూజలు నిర్వహించారు. పలువురు భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త దారా రంగారావు పర్యవేక్షణలో పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతున్నాయి. మార్చి 1న స్వామివార్ల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుంది.

సాగర్ జలాలు విడుదల చేయాలి

రెడ్డిగూడెం: మండలానికి సాగర్‌జలాలను విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.మాధవరెడ్డి కోరారు. ఆదివారం రెడ్డిగూడెంలో అమర భవన్‌లో ఆయన మాట్లాడారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు కారణంగా మామిడి రైతులు పెద్ద ఎత్తున్న నష్టపోయే ప్రమాదం ఉందని మామిడి నిలబడాలంటే నీరు అవసరమన్నారు. మండలంలో మొక్కజొన్న, ఎర్రనూలు పంటను రైతులు సాగు చేస్తున్నారని, ఆ పంటలకు కూడా నష్టం రాకుండా ఉండేందుకు సాగునీటి అవసరం ఉందన్నారు. అధికారులు, నాయకులు స్పందించి వెంటనే సాగర్ జలాలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం, రెడ్డిగూడెం మండల కార్యదర్శి బొల్లారెడ్డి మోహనరెడ్డి, అధ్యక్షులు అప్పిరెడ్డి ఉయ్యూరు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆధార్ శిబిరాలు

గంపలగూడెం: గంపలగూడెం-1 సచివాలయంలో సోమ, మంగళవారాలు ప్రత్యేక ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు కొనసాగుతుందన్నారు. వేలిముద్రల అప్డేషన్, అడ్రస్ మార్పు, తప్పుల సవరణ, సెల్ ఫోన్ నంబర్ లింక్ చేసుకోవచ్చన్నారు. ఎన్టీఆర్ జిల్లా మార్పునకు మాత్రం యూఐడీఏఐ గెజిటెడ్ పత్రాన్ని గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేసి అందజేయాలన్నారు. క్యాంపులో ఉదయం 9 గంటల నుంచి మొదటి అరగంట కూపన్లు తీసుకున్న వ్యక్తులకు మాత్రమే ఆధార్ అప్డేషన్ చేస్తామని డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్ తెలిపారు. చిన్న పిల్లల ఆధార్‌కార్డు పొందేందుకు తప్పని సరిగా తల్లిదండ్రులలో ఒకరి ఆధార్‌కార్డుతో పాటు ఒకరు తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: మైలవరం విద్యుత్ ఉపకేంద్రం మైలవరం టౌన్ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కరెంట్ వైర్లకు అడ్డంకిగా ఉన్న చెట్లు కొమ్మలు తొలగించడం, ఇతర మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. తిరువూరు రోడ్, బస్టాండ్ ఎదురుగా, ప్రభుత్వ హాస్పిటల్, సిద్ధిపేట, ఎస్వీఎస్ నగర్, రామకృష్ణ కాలనీ, బందర్, ఎంపీడీఓ కార్యాలయం రోడ్, మార్కెట్‌రోడ్, శివాలయం వీధి, నూజివీడు రోడ్, విజయావాడ రోడ్, పొందుగల రోడ్, శివాజీ వీధి తదితర ఏరియాలో కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా తెలిపారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ అయ్యప్ప టెంపుల్ ఫీడర్, 11 కేవీ వాసవీ ఫార్మా ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా 2 గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు రాధా మాధవ టింబర్ డిపో, మురళీకృష్ణ టింబర్ డిపో ఏరియా, రెడీమిక్స్ ప్లాంట్ ఏరియా, ల్యాంకో కాలనీ, జీబీజీ స్కూల్, వీఆర్‌ఎల్ గోడౌన్ ఏరియా, ట్రిబుల్ ఎస్ కాలనీ, వస్త్రలతకాలనీ, పోస్టల్ డిపార్ట్‌మెంట్, మధుసూదన టింబర్ డిపో ఏరియా వరకు కరెంట్ నిలిపి వేయనున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అలరించిన నాటక మహోత్సవం


నాటికలో ఓ దృశ్యం

నూజివీడు: నూజివీడు కళావేదిక, శ్రీ సత్య నృత్య సంగీత అకాడమీ, కనకం చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో నిర్వహించిన నూజివీడు నాటక మహోత్సవం పట్టణ ప్రజలను అలరించింది. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమైన ఈ ఉత్సవం రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. దీనిలో సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన థింక్ నాటిక, చిలకలూరిపేటకు చెందిన ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అలీతో సరదాగా అనే నాటికలు ఆకట్టుకున్నాయి. వీటితో పాటు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు, సినీ గీతాలకు డ్యాన్సులు, సినీగీతాల విభావరి కార్యక్రమాలు ఆద్యంతం వీక్షకులను కట్టిపడేశాయి. నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్, వేంపాటి మోహన్,కనకం చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు మిర్యాల కృష్ణకిషోర్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

ముసునూరు: యువ రైతు ఆత్మహత్యాయత్నానికి దారి తీసిన మొక్కజొన్న పంటను మండల వ్యవసాయాధికారి చేబత్తిన శ్రీనివాసరావు ఆదివారం పరిశీలించారు. నూజివీడు మండలం పోలసానపల్లికి చెందిన యువ రైతు వేముల వెంకటరావు మండలంలోని ముసునూరులో మరీదు హరిబాబుకు చెందిన 6.34 ఎకరాల విస్తీర్ణంలో సీపీ 31-ఎ విత్తన మొక్కజొన్నను సాగు చేశాడు. పంట ఆశాజనకంగా లేకపోగా, మొక్కజొన్న పొత్తుకు విత్తనాలు కూడా సరిగా పట్టకపోవడంతో నష్టపోతున్నాననే దిగులుతో శనివారం ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో వెంకటరావు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను వ్యవసాయాధికారి పరిశీలించి, విత్తన కంపెనీ ప్రతినిధులు, సమీప రైతుల నుంచి వివరాలు సేకరించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


ఆగిరిపల్లిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

ఆగిరిపల్లి: చట్టవ్యతిరేకమైన కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలకు తీసుకుంటామని ఎస్‌ఐ నంబూరి చంటిబాబు హెచ్చరించారు. మండలంలోని రౌడీషీటర్లకు, కేడీలకు, సస్పెక్ట్ షీట్‌లు కలిగిన వారికి ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అందరూ సత్ప్రవర్తనను కలిగి ఉండాలని, వివాదాలకు దిగడం వంటివి చేయరాదని, అసాంఘిక శక్తులతో కలిసి తిరగకూడదని సూచించారు. గొడవలకు దిగినా, చట్టవ్యతిరేకంగా ప్రవర్తించినా చర్యలు తప్పవన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా తక్షణమే అదుపులోకి తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ కళాశాల స్పోర్ట్స్ ఫెస్ట్


స్పోర్ట్స్ ఫెస్ట్‌లో కబడ్డీలో తలపడుతున్న వివిధ కళాశాలల క్రీడాకారులు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరిగిన అంతర్ కళాశాలల స్పోర్ట్స్ ఫెస్ట్ ఆదివారంతో ముగిసింది. కళాశాల చైర్మన్ ఎంఎం.కొండయ్య తొలిరోజు క్రీడలను ప్రారంభించారు. పోటీల్లో సుమారు 25 ఇంజినీరింగ్ కళాశాలల నుంచి 42 టీమ్స్ పాల్గొన్నాయి. బాలికల టెన్నీస్‌లో కంచికచర్ల మిక్ కళాశాల విన్నర్స్, ఆర్కే కళాశాల రన్నర్స్‌గా నిలిచాయి. బాలుర వాలీబాల్ విన్నర్ జీయెట్ కళాశాల, రాజమహేంద్రవరం, రన్నర్స్ మిక్ కళాశాల, కబడ్డీ విన్నర్స్, నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల, రన్నర్స్ పీవీపీ సిద్ధార్థ కళాశాల, విజయవాడ నిలిచాయి. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య విజేతలకు బహుమతులు అందజేశారు.

'అగ్ని' బాధితులకు సాయం

ముసునూరు: అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన కుటుంబాలకు తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి చౌదరి ఆపన్నహస్తం అందించారు. మండలంలోని గుళ్లపూడి శివారు గుడిపాడు గ్రామంలో విద్యుదాఘాతంతో రెండు ఇళ్లతోపాటు, తండ్రిని, సర్వస్వాన్ని కోల్పోయి, నిరాశ్రయులైన పిల్లి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు కుటుంబాలను గారపాటి ఫౌండేషన్ ప్రతినిధులు పరామర్శించారు. ఫౌండేషన్ తరపున ఆదివారం ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల చొప్పున రూ.20 వేలు, దుస్తులు, పచారీ సరుకులు గ్రామ పెద్దలు మారునీళ్ల కృష్ణారావు ద్వారా ఆదివారం అందజేశారు. మండలపు రవిప్రసాద్, ధర్మరాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సంఘ కార్యవర్గ ఎన్నిక


వీఆర్‌ఏల సంఘ అధ్యక్ష కార్యదర్శులు

తిరువూరు: తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘ కొత్త కార్యవర్గ ఎన్నిక ఆదివారం స్థానిక సుందరయ్య భవన్లో జరిగింది. గౌరవాధ్యక్షుడిగా ఎస్‌వీ భద్రం, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా ముచ్చింతాల రాంబాబు, కోటమర్తి వెంకటకృష్ణయ్య, కోశాధికారిగా కోట శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఈ ఎన్నిక నిర్వహించారు.

కోనేరు నిర్మాణానికి రూ.లక్ష వితరణ




నెమలి(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రంగా ఉన్న గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో కోనేరు నిర్మాణానికి ఆదివారం భక్తులు రూ.లక్ష వితరణగా అందజేశారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన పసుమర్తి రామకృష్ణారావు, పద్మప్రియ దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖకు అందజేశారు. దాతలైన దంపతులను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాల చార్యులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు.

3న కొబ్బరి చిప్పల సేకరణ హక్కుల వేలం

విస్సన్నపేట: మండలంలోని పుట్రేలలో మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో కొబ్బరి చిప్పలు, వస్త్రాల వేలం మార్చి 3న నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్‌కుమార్, ఈవో సీతారామ్య ఆదివారం తెలిపారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఆ రోజు ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ప్రారంభమవుతుంది. హక్కుదారులు సంవత్సర కాలంపాటు కొబ్బరి చిప్పలను పోగుచేసుకోవచ్చని తెలిపారు. లడ్డూ ప్రసాదం తయారు చేసి ఇచ్చే హక్కునకు(బ్రాహ్మణవంటవారు)బహిరంగవే లం కూడా నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు ధరావతుచెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థుల అన్నదానం



తిరువూరు: మండలంలోని మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థులు తిరువూరు అమ్మ ప్రేమాశ్రమంలోని వృద్ధులు, దివ్యాంగులకు ఆదివారం అన్నదానం చేశారు. తాము పొదుపు చేసిన డబ్బుతో ఆశ్రమంలో ఈ వితరణ ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. వారిని ఆశ్రమ నిర్వాహకులు రవిచంద్ర అభినందించారు. విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోవాలని వారు కోరారు.

ఏపీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కిరణ్

ఇబ్రహీంపట్నం: ఏపీ ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడిగా కంభంపాటి కిరణ్ నియమితులయ్యారు. ఇబ్రహీంపట్నంలో ఆదివారం కార్యకర్తల సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరారవు మాదిగ మండల అధ్యక్షుడి నియామకం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, మాదిగల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు మందా నాగమల్లేశ్వరరావు, నియోజకవర్గం కన్వీనర్ నల్లమోతు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పేకాట, కోడి పందేల శిబిరాలపై దాడి

మైలవరం: మండలంలోని తోలుకోడు, ఓబులాపురం గ్రామాల మధ్య నర్సరీలో నిర్వహిస్తున్న పేకట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. 14 మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.8700 నగదు, 7 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ పీ రాంబాబు తెలిపారు. మైలవరం మండలం కొత్త మంగాపురం గ్రామం చివర మామిడి తోటలో కోడి పందేల శిబిరంపై దాడి చేసి 9 మంది వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.3 వేల నగదు, రెండు కోడి పుంజులు, 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ వివరించారు.